నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 | కరీంనగర్, గురువారం 29 మే 2025 | JAGTIAL

# సన్నపు వడ్లు కొంటరా..? కొనరా..?

ఆరుగాలం కష్టం నీళ్లపాలు చేస్తరా..?

- కాంటా పెట్టకపోతే చావే శరణ్యం
- వెంకట్రావుపేట రైతుల ఆవేదన
- కోనరావుపేటలో పురుగుల మందు డబ్బాలతో ధర్నా



కోనరావుపేట కమాన్‌వద్ద రోడ్డు పై పురుగుల మందు డబ్బాలతో బైఠాయించిన రైతులు

కోనరావుపేట, మే 28: రైతులు కన్నెర్ర జేశారు. సన్నపు వడ్ల కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యంపై భగ్గుమన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేట రైతులు రోడ్డెక్కారు. వడ్లు కొనకపోతే చావే శరణ్యం అంటూ పురుగుల మందు డబ్బాలు చేతపట్టుకొని ఆందోళన చేశారు. ధాన్యం కొంటరా..? కొనరా..?, మా ఆరుగాలం కష్టం నీళ్లపాలు చేస్తరా..? అని ప్రశ్నించారు. బోనస్ దేవుడెరుగు..? కనీసం కొనుగోలైనా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకట్రావుపేటలో ప్రభుత్వం రెండు నెలల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిందని చెప్పారు. రైతులు పంటను కోసింది కోసిన్నట్లుగా ధాన్యాన్ని కేంద్రానికి తరలిస్తే, అధికారులు అంతంతమాత్రంగానే దొడ్డు వడ్లను కొన్నారని, సన్నపు వడ్లను పక్కన పెట్టేశారని వాపోయారు. సెంటర్ నిర్వాహకులను అడిగితే మిల్లర్లు సన్నపు వడ్లు దించుకోవడం లేదని, ఏం చేయలేమంటూ చేతులెత్తేశారని, దీంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇటీవల వర్షానికి ధాన్యం మొలకలు వచ్చిందని, ఇలా తమను గోస పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సెంటర్‌లోని వడ్లు కొనుగోలు చేయాలని లేదంటే పురుగుల మందే దిక్కని పేర్కొన్నారు.



వర్షంలో తడిసి ముద్దయిన ధాన్యం



మొలకెత్తిన్న వడ్లు

## అనంతపల్లి రైతుల లబోదిబో

బోయినపల్లి రూరల్, మే 28: మండలంలోని అనంతపల్లి గ్రామ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయి మొలకెత్తడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన ధాన్యం కళ్ల ముందే మొలకెత్తడంతో రైతన్న బాధ అంతా ఇంతా కాదు.. ధాన్యం తడవడంతో ఆరబెట్టలేక అవస్థలు పడుతున్నారు. వరి కోతలు జరిగి నెలన్నర దాటినా ప్రభుత్వం సరైన సమయంలో ధాన్యం కొనుగోలు చేయక అకాల వర్షాలకు తడిసిపోతున్నది. కాంగ్రెస్ కేవలం మాటల ప్రభుత్వమని రైతన్న బాధ కనిపించడం లేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

- రోడ్డుపై సర్కస్ ఫీట్లు



కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ముకరంపురలోని జ్యోతిబాపూలే మైదానం వెనుక రోడ్డు అధ్వానంగా మారింది. మొత్తం గుంతల మయంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తున్నది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

# కొత్తపల్లి భూముల రిజిస్ట్రేషన్లు రద్దు

- సర్వే నంబర్లు 175, 197,198లలో 476 రిజిస్ట్రేన్ల రద్దుకు అధికారుల సమాయత్తం
- ఐదు సార్లు నోటీసులు వచ్చినా పట్టించుకోని నాటి సబ్ రిజిస్ట్రార్లు
- గంగాధరలో రిజిస్ట్రేషన్ల రద్దును ప్రారంభించిన ఆర్డీవో
- అన్నీ సవ్యంగా సాగితే నాలుగు రోజుల్లో క్యాన్సలేషన్ ప్రక్రియ పూర్తి





గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తున్న ఆర్డీవో మహేశ్వర్

**కరీంనగర్ జిల్లా కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని 175, 197,198 సర్వే నంబర్లలో జరిగిన 476 రిజిస్ట్రేన్లను రద్దు చేయడానికి అధికారులు సమాయత్తమయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ మూడు సర్వే నంబర్లలో జరిగిన 476 రిజిస్ట్రేన్లను రద్దు ప్రక్రియను ఆర్డీవో మహేశ్వర్, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. అన్నీ సవ్యంగా సాగితే నాలుగు రోజుల్లో రద్దు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.**

గంగాధర, మే 28 : కొత్తపల్లి మండలకేంద్రంలోని సర్వే నెంబర్లు 175, 197, 198లో చేసిన భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కలెక్టర్ కార్యాలయం నుంచి పది రోజుల క్రితం గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నోటీసులు అందాయి. 30 ఏండ్లుగా సీలింగ్ యాక్టు అమలులో ఉన్నందున సదరు భూములపై ఎలాంటి లావాదేవీలూ జరపకూడదని హైకోర్టు ఆర్డర్ ఉంది. ఈ మూడు సర్వే నెంబర్లలో సుమారు 20 ఎకరాల భూమి ఉండగా అందులో ఎలాంటి లావాదేవీలూ జరపవద్దని 1997, 1998, 2006, 2011, 2016 కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాయానికి నోటీసులు అందాయి. హైకోర్టు ఆర్డర్, కలెక్టర్ నోటీసులను బేఖాతరు చేసిన కొందరు సబ్ రిజిస్ట్రార్‌లు సర్వే నెంబర్లు 175లో 3, 197లో 291, 198లో 182 రిజిస్ట్రేషన్లు చేశారు. 2018 వరకు కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాయం పరిధిలో ఉన్న కొత్తపల్లి మండలాన్ని గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి మార్చారు. కానీ, అప్పటికే కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 424 రిజిస్ట్రేషన్లు జరిగాయి. తర్వాత గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 52 రిజిస్ట్రేషన్లు కాగా, ఒకటి మాత్రం లోకాయుక్త ఆదేశాల మేరకు జరిగినట్లు తెలిసింది. కొత్తపల్లి భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లపై లోక్‌సత్తా నాయకులు చేసిన పోరాటంతో భూముల అక్రమ రిజిస్ట్రేషన్ విషయం వెలుగులోకి వచ్చింది. లోకాయుక్త సూచనల మేరకు కలెక్టర్ పమేలా సత్పతి సర్వే నెంబర్లు 175, 197, 198లలో ఇప్పటి వరకు జరిగిన 476 రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు.

### అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటారా?

సీలింగ్ యాక్టు అమలులో ఉన్న 175, 197, 198 సర్వే నెంబర్లలో ఎలాంటి లావాదేవీలూ జరపవద్దని హైకోర్టు ఆర్డర్ ఉన్నది. భూముల రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఐదు సార్లు కరీంనగర్ రూరల్, గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నోటీసులు అందినా వాటిని బుట్టదాఖలు చేసి రిజిస్ట్రేషన్లు చేసిన అవినీతి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇన్నేళ్లుగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా ఉన్నతాధికారులకు తెలియలేదా?, లేక కావాలనే వారు పట్టించుకోలేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కలిసి 476 రిజిస్ట్రేషన్లకు సంబంధించి కోట్లాది రూపాయల అవినీతి జరిగి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రొహిబిటెడ్ భూముల్లో భూ విక్రయాలు చేసిన అక్రమార్కులు, వీరిని ప్రోత్సహించిన సబ్ రిజిస్ట్రార్లపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావని ప్రజలు కోరుతున్నారు.

### కలెక్టర్ ఆదేశాల మేరకే రిజిస్ట్రేషన్లు రద్దు

175, 197, 198 సర్వే నెంబర్లలో అక్రమంగా జరిగిన 476 రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల రద్దు ప్రక్రియను ప్రారంభించాం. అన్నీ సవ్యంగా సాగితే నాలుగు రోజుల్లో క్యాన్సలేషన్‌ను పూర్తి చేస్తాం. రిజిస్ట్రేషన్ల రద్దు ప్రక్రియ పూర్తయిన తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

- మహేశ్వర్, కరీంనగర్ ఆర్డీవో

### నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం

175, 197, 198 సర్వే నెంబర్లలో అక్రమంగా జరిగిన 476 రిజిస్ట్రేషన్లలో ఏఏ సబ్ రిజిస్ట్రార్ ఎన్ని రిజిస్ట్రేషన్లు చేశారు, ఏ సంవత్సరంలో చేశారు అన్న వివరాలను సేకరిస్తున్నాం. రిజిస్ట్రేషన్ల రద్దు పూర్తైన తర్వాత నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. విచారణ చేసిన తర్వాత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

- ప్రవీణ్‌కుమార్, కరీంనగర్ జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి



# అంతర్గత బదిలీల్లో గందరగోళం

- ఒత్తిళ్లు.. పైరవీల జోరు
- ఇటీవల 12 మందికి స్థానచలనం
- చోటు మారేందుకు కొందరు ససేమిరా
- ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో మళ్లీ యథాస్థానంలోకి
- రికార్డ్ అసిస్టెంట్ నాలుగు నెలల్లో మూడు విభాగాలకు ట్రాన్స్‌ఫర్
- అధికారుల తీరుపై అసంతృప్తి
- వేధిస్తున్న పర్యవేక్షకుల కొరత
- గాడి తప్పుతున్న పాలన!

వేములవాడ, మే 28: రాజన్న ఆలయంలో అంతర్గత బదిలీల ప్రక్రియ గందరగోళంగా తయారైంది. అధ్వానంగా మారుతున్నది. ఒక రికార్డ్ అసిస్టెంట్‌ను నాలుగు నెలల్లో మూడు విభాగాలకు ట్రాన్స్‌ఫర్ చేయడం విమర్శలకు తావిస్తుండగా, చోటు మారేందుకు ఇష్టపడని వారి పైరవీల జోరు నడుస్తున్నట్లు తెలుస్తున్నది. వారం రోజుల కింద 12 మందికి స్థానచలనం కల్పించగా, మరో విభాగానికి వెళ్లేందుకు ఇష్టపడని పలువురి ఒత్తిళ్లతో మళ్లీ యథాస్థానంలో కొనసాగించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ప్రచారం జరుగుతున్నది. ఓ వైపు ఆలయంలో పర్యవేక్షకుల కొరత వేధిస్తుండడం, ఉన్నవారిపై అదనపు భారం పడుతుండడంతో పాలన గాడి తప్పుతున్నదనే విమర్శ వస్తున్నది.

### పైరవీతో యథాస్థానంలోకి..

రాజన్న ఆలయంలో 12 మంది ఉద్యోగులను ఈ నెల 21న అంతర్గతంగా బదిలీ చేశారు. ఇందులో ఐదుగురు పర్యవేక్షకులు, ఒక సీనియర్ అసిస్టెంట్, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు రికార్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. అయితే, వీరిలో ఒక ఉద్యోగి తాను పనిచేస్తున్న ప్రధాన విభాగాన్ని వీడేది లేదని భారీగా పైరవీ చేసినట్లు సమాచారం. ఏకంగా దేవాలయ ఉన్నతాధికారిపై ఒత్తిడి తేవడంతో ప్రస్తుతానికి యథాస్థానంలో కొనసాగించాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఒక రికార్డ్ అసిస్టెంట్‌ను నాలుగు నెలల్లో మూడు విభాగాలకు ట్రాన్స్‌ఫర్ చేయడం విమర్శలకు తావిస్తున్నది. తొలుత విచారణ విభాగానికి బదిలీ చేసి, నెలన్నర క్రితం కల్యాణకట్ట, ఆ వెంటనే గోశాలకు బదిలీ చేయడంతో సదరు ఉద్యోగి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ సెలవుపై వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

### అస్తవ్యస్తంగా పాలన!

ఆలయంలో పర్యవేక్షకుల కొరతతో పాలన గాడితప్పుతున్నదనే విమర్శలు వస్తున్నాయి. 14 మంది పర్యవేక్షకులు ఉండాల్సి ఉండగా, సాధారణ బదిలీలతో వారి సంఖ్య తొమ్మిదికి పడిపోయింది. ఇందులో ఒకరు అనారోగ్యంతో సెలవులో ఉండగా, మరొకరు ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఏడుగురు మాత్రమే విధుల్లో ఉండగా, ఒక్కొక్కరికి మూడు శాఖలతో అదనపు బాధ్యతలు అప్పగించడంతో పనిభారం పెరుగుతున్నది. ఫలితంగా ఏ ఒక్క బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. కాగా, పర్యవేక్షకుల విషయంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని వివరణ కోరగా వచ్చే సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా మరింత సిబ్బందిని కేటాయించాలని రాష్ట్రదేవాదాయ శాఖ కమిషనర్‌ను కోరుతామని తెలిపారు.

### బదిలీలలో ఆయనదే మార్క్

ఆలయంలో అంతర్గత బదిలీలు సర్వసాధారణమే అయినప్పటికీ పరిపాలన కార్యాలయంలోని ఓ అధికారి వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఇటీవల ఆరోపణలు ఎదుర్కొన్న ఒక రికార్డు అసిస్టెంట్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి, తర్వాత అతనిపై చార్జెస్ ఉన్నాయని ఇచ్చిన పదోన్నతిని వెనక్కి తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నెలలో రెండు సార్లు అంతర్గత బదిలీలు చేపట్టగా, 16న తొలి విడుతగా జరిగిన 8 మంది బదిలీల వ్యవహారంలో ఆయన మార్క్ చూపించినట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధాన శాఖల బదిలీల వ్యవహారంలో ఆరోపణలున్నాయి.

# కలెక్టరేట్ పక్కనే కంపు..!

బాయిల్డ్ రైస్ మిల్లు వ్యర్థాలతో దుర్వాసన



రైస్ మిల్లులు వదులుతున్న దుర్గంధం

పెద్దపల్లి, మే 28 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి కలెక్టరేట్ పక్కన కంపు కొడుతున్నది. సమీపంలో ఉన్న పారా బాయిల్డ్ రైస్ మిల్లులు వదిలే వ్యర్థాలతో దుర్వాసన వస్తున్నది. జిల్లా ఉన్నతాధికారులు నిత్యం అదే రోడ్డు పక్క నుంచే ప్రయాణిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. వ్యర్థాలతో పక్కనే ఉన్న బృందావన్‌కాలనీ వాసులు నిత్యం అనారోగ్యం బారిన పడుతున్నారు. దీనికి తోడు పెద్దపల్లి–కరీంనగర్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న రైస్ మిల్లుల నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగు నీటిని రోడ్డుపక్కన ఉన్న చిన్న కుంటలోకి వదులుతుండడంతో ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### కాలనీలో ఉండలేకపోతున్నాం



రైస్ మిల్లులు వదిలే వ్యర్థాల వల్ల నిత్యం ముక్కు మూసుకొనే ఉండాల్సి వస్తున్నది. చిన్నగా గాలి వస్తే వాసనతో ఇండ్లల్లో ఉండలేక పోతున్నాం. కాలనీలో ప్రజలు నిత్యం అనారోగ్యం పాలవుతున్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదు. కలెక్టరేట్‌కు పక్కనే ఇంత కంపు కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు ఈ విషయంలో చొరవ చూపి దుర్వాసనను దూరం చేయాలి.

- సంతోష్, అడ్వొకేట్, బృందావన్‌కాలనీ, పెద్దపల్లి



బృందావన్‌కాలనీ పక్కనే రైస్ మిల్లులు వదిలిన దుర్గంధం

# అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లా?

'మడిపల్లి'లో గ్రామస్తుల ఆందోళన

- కాంగ్రెస్ నాయకుల బంధువులు, అనర్హులకు ఇచ్చారని ఆరోపణ
- ఇందిరమ్మ కమిటీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదని మండిపాటు



ఆందోళన చేస్తున్న మడిపల్లి గ్రామస్తులు

జమ్మికుంట, మే 28 : మండలంలోని మడిపల్లి గ్రామంలో 'ఇందిరమ్మ కమిటీ' ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ నాయకుల బంధువులకు, అనర్హులకు ఇండ్లు కేటాయించారని గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనర్హులకు ఇండ్లను ఎలా కేటాయించారని గ్రామ కార్యదర్శిని నిలదీశారు. ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎంపిక చేశామని, నా చేతిలో ఏమీ లేదని కార్యదర్శి స్పష్టం చేయడంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు న్యాయం జరగాల్సిందేనని, ఉన్నతాధికారులు రావాలని డిమాండ్ చేస్తూ భీష్మించుకు కూర్చున్నారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న జమ్మికుంట ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సూచించారు. ఆందోళన విరమింపజేయడంతో సమస్య సద్దుమణిగింది.

సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



# కేటీఆర్ క్యాంపు ఆఫీసులో రేవంత్ ఫొటో ఎందుకు?

- నోట్ల కట్టలతో దొరికిన వ్యక్తి చిత్రం ఎలా పెడుతరు
- ప్రజలు తమ ఇండ్ల ముందు దిష్టిబొమ్మలా పెట్టుకుంటామంటున్నరు
- ప్రొటోకాల్ విషయంలో ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు హాస్యాస్పదం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, మే 28: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రభుత్వం కేటాయించిన క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టాలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ప్రశ్నించారు. డబ్బు సంచులతో దొరికిన దొంగ ఫొటోను ఎలా పెడతారన్న ఆయన, ప్రజలు తమ ఇంటి ముందు దిష్టిబొమ్మలా పెట్టుకుంటామని చెబుతున్నారని పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రొటోకాల్ గురించి ఆది శ్రీనివాస్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాలలో ప్రొటోకాల్ ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా స్థాయిలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో సీఎస్‌కు ఉంటుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆది శ్రీనివాస్ సిరిసిల్లలో పాల్గొన్న అభివృద్ధి కార్యక్రమాలకు కేటీఆర్‌ను ఎందుకు ఆహ్వానించలేదని, ప్రొటోకాల్ ప్రకారం కేటీఆర్ ఫొటో లేకపోవడంపై ఎందుకు మీరెందుకు ప్రశ్నించలేదో చెప్పాలని ప్రశ్నించారు. కేటీఆర్ చొరవతో నిర్మితమైన అభివృద్ధి కార్యక్రమాలను మీరే చేసినట్లు ప్రొసీడింగ్‌లు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన క్యాంపు కార్యాలయంలో రేవంత్ ఫొటో పెట్టాలంటున్నారు కదా, మరి రాహుల్, ప్రియాంక క్యాంపు కార్యాలయాల్లో మోదీ ఫొటోలు ఎక్కడ పెట్టారో చూపించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ కాంగ్రెస్ కార్యకర్తలా వ్యహరిస్తున్నారని ఆరోపించిన ఆయన, ప్రొటోకాల్ అమలు చేయని అధికారులపై రాబోయే రోజుల్లో చర్యలు తప్పవన్నారు. క్యాంపు కార్యాలయాలు కేసీఆర్ సొంత డబ్బులతో కట్టలేదని అంటున్న మీరు, రేవంత్‌రెడ్డి ఏమైనా తన సొంత ఇంటి డబ్బులతో కట్టాడా..? అని ప్రశ్నించారు. కూల్చివేతలు తప్ప అభివృద్ధి తెలియన వ్యక్తి రేవంత్ అని, క్యాంప్ ఆఫీసుల్లో మహాత్ముల చిత్రం పెట్టుకోమంటే అర్థం ఉంటుందని, యాభై లక్షలతో దొరికిన దొంగ ఫొటో ఏ విధంగా పెట్టుకోమంటారని నిలదీశారు. వేములవాడలో అనేక సార్లు ప్రజల చీత్కారంతో ఓడిపోయిన ఆది శ్రీనివాస్, 'అయ్యో పాపం శీనన్న' అంటే గెలిచారనే విషయాన్ని మరిచిపోవద్దని హితవుపలికారు. సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధిలో గోరంత శాతం కూడా సాధించబోవని చురకలంటించారు.

### రాష్ట్రంలో రాక్షస పాలన

రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన సాగుతుందని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి విమర్శించారు. కక్షసాధింపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతలు రేవంత్ ఫొటోతో వచ్చి కేటీఆర్ క్యాంపు కార్యాలయం వద్ద గుండాయిజం ప్రదర్శించారని, కాంగ్రెస్ నేత భీమవరం శ్రీనివాస్ తనపై చేసిన విమర్శలు విచిత్రంగా ఉన్నాయన్నారు. తాను అనేక సార్లు వివిధ హోదాల్లో పని చేసినప్పటికీ ఎక్కడా ప్రొటోకాల్ ఉల్లంఘించలేదన్నారు. భవిష్యత్‌లో ఆరోపణలుచేసే ముందు పునరాలోచన చేసుకోవాలని హితవుపలికారు. సమావేశంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దిడ్డి రాజు, వెంగళ శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, రాజిరెడ్డి, వీరగోని శ్రీనివాస్‌గౌడ్ నాయకులు ఉన్నారు.